కథానిక:

అధ్వాన్నపు బ్రతుకు

"వనమాలి"

పొంగలు జిమ్ముకొంటూ బండి ప్లాట్‌ఫారం దాటింది "మహారాజులు, ధర్మదాతలు, బాబూ! దిక్కులేని దాన్ని. కాని డబ్బ యిప్పించండి," అంటూ ఆమె చెయ్యి చాస్తూ కంపార్టుమెంటు అంతా, ప్రతివారి దగ్గరకూ వెళ్తూ కలయ తిరుగుతుంది. నేనూ, పార్వతి ఒక మూలగావున్న బెంచీమీద కూర్చున్నాం. మాదగ్గరకు కూడ వచ్చి ఆమె చెయ్యి చాచింది.

మాలిన్యముఖంతో, జీర్ణవస్త్రాలతో, వాస్తవంగా లేమిని ప్రకటిస్తూ వున్న ముఖంతో, కడుపు లోతుకు పీక్కుపోయి, డొక్కలెక్కటుకుపోయి వున్న ఆమె ముఖంలోకి చూచేటప్పటికి నాహృదయం జాలితో కదిలింది. అంత మలిన [illegible] వున్నా, ఆమె ముఖంలో ఒక విధమైన వర్చస్సు గంభీరంగా ప్రకాశిస్తూ వుంది. ఆమెను చూస్తూన్న కొద్దీ, ఎన్ని కష్టాలపాలైనా, [illegible] వుంటుందిగదా అనిపించింది.

"అమ్మా; ఇలా నోటిమాటలతో చెయ్యి చాస్తే నీయందెవరికీ దయకలుగుతుంది? నువ్వేదైనా చక్కని పాట పాడు. గానానికి మానవ హృదయాన్ని ఆకర్షించి వశంచేసుకొనే శక్తి వుంది. అందరిహృదయాలూ నీ వైపుకే మరలుతాయి. నువ్వు అప్యాయంగా భుక్తి గడుపుకో వచ్చు." అన్నాను.

పాట, మాట వినేటప్పటికే ఆమె కళ్ళవెంబడి నీళ్ళు గిర్రున తిరిగాయి.

"ఎందుకమ్మా! అలా కన్నీళ్ళు పెడతావ్? పాటలు రావా?" అంది పార్వతి భిక్షుకి ముఖంలోకి చూస్తూ.

"కాదమ్మా!......అతడు బ్రతికుండగా పాడే వాళ్ళం" అని హీనస్వరంలో అంది.

"అతడంటే ఎవరు? నీ[illegible]?... ..."

"కాదు. బాబు! లోకంలో కొందరు భార్యాభర్తలమనీ, కొందరు అన్నాచెల్లెళ్ళమనీ. అనుకొనేవారు. నిజం చెప్పాలంటే, ఆయనకు నేనాధారం. నాకు ఆయన ఆశ్రయదాత. ఒకరికొకరం తోడునీడలం." అంది భిక్షుకి కలవరపడుతూను.

"పార్వతి ఆదరణ చూపిన కౌతూహలంతో భిక్షుకి తన కథ చెప్పటం మొదలుపెట్టింది.

* * *

"కనవరం అనే కుగ్రామం మాది. అది జమిందారీ యిలాకాలోనిది. మా తండ్రి భూమిన్ని మకతాకు తీసుకొని సేద్యంచేస్తూ, జీవనోపాధికి లోటులేకుండా కాలం గడ్పుతూ వుండేవాడు. నేను పుట్టిన ఏడవరోజునే, మా అమ్మ బాలింతజబ్బువల్ల మరణించింది. మానాన్న చిన్నవయస్సులో వాడే అయినా, మళ్ళీ నాకొరకు వివాహం చేసుకోలేదు. ఆయన తన సర్వస్వం నేనే ననుకొంటూ గారాబంగా పెంచి పెద్దదాన్ని చేశాడు. తల్లిలేని లోటేమిటో నాకెన్నడూ తెలిసేదిగాదు. అపార్ధశీలు, నాకు ఎక్కడ, ఏలోటు వస్తుందోనని మానాన్న వెయ్యికళ్లతో కాపాడుతూవుండేవాడు. నాకు పదహారోఏట, తాను చెమటోడ్చికష్టించి సంపాదించిన అయిదు వేలరూపాయిలూ కట్నంగా యిచ్చి వైభవంగా పెళ్లి చేశాడు. నేను అత్తవారింటికి వెళ్లేటప్పటికి వారికి మంచి భూస్థితి, పన్నెండుంబాతిక మండువాయిల్లూ వున్నాయి. కలిగిన యింటికి కోడలనైనందుకు నా అదృష్టానికి ఎంతగానో మురిసిపోయాను. ఆ ముచ్చట మూన్నాళ్లుకూడ నిలవలేదు.

నా భర్త, సవతి అత్తగారు, నేను మాత్రమే యింట్లో వుంటుండేవాళ్ళం. నా భర్తకు మొదట్నుంచీ దురభ్యాసాలు వున్నాయి. ఒక్కొక్కరోజు ఏ అర్ధరాత్రో తిరిగి, తిరిగి యింటికి వస్తూవుండేవారు. ఒక్కతెనూ తలుపు తెరచుకొని ఎదురుచూస్తూ కూర్చునేదాన్ని. తనకు అవసర మనుకొన్న రోజున, వస్తూనే ఆదరంగా పలకరించేవారు. లేని రోజున ధుమ, ధుమలాడుతూ ఏదో వొకవంకతో పోట్లాడేవారు. సిగ్గూ,బిడియంలేకుండా చెబుతున్న నా మాటలు మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు." అని భిక్షుకి మా ముఖంలోకి చూచింది.

"యథార్థాన్ని చెప్పటంలోనే మానవత్వపు గొప్పతనం ప్రతిబింబిస్తుంది. ఊ...కానియ్యి అమ్మా.." అన్నాను.

"మాది మొదట్నుంచీ పొత్తు కుదరని దాంపత్యమే. నా జీవితంలో ఏ ఒక్కనాడూ ఆయన దగ్గర తగిన ఆదరం, గౌరవం, ప్రేమ పొంద ఎరుగను. క్రమంగా దురభ్యాసాలవల్ల రాబడికి, ఆరోగ్యభాగ్య రెట్టింపుకు పెరిగింది దాంతో యింటి చుట్టూ అప్పులవాళ్లు చేరి గోలచెయ్యటం ప్రారంభించారు. క్రమంగా సంసారంలో జరుగుబాటుకు కొరవ ఏర్పడ మొదలుపెట్టింది. వారికి గానీ, ఆమెకుగానీ, ఏ కొరవ ఏర్పడ్డా, యింట్లో ఏది తక్కువైనా కారణం నామీదే కల్పించి, నిందించేవారు. నేను ఆ యింట్లో కాలుపెట్టడమే వారి కుటుంబనాశనానికి హేతువైందనేవారు. ఎప్పుడైతే భర్తదృష్టిలో నీరసింపబడ్డానో ఆ యింట్లో నా బ్రతుకు మరింత హీనమయిపోయింది. అందరకూ సవతిఅత్తగారి అధికారజులుం మరీ ఎక్కువయింది. నేను ఎంతటి మర్మాంతక యాతనను అనుభవిస్తున్నా, నా తండ్రికిమాత్రం కొంచెంకూడ తెలియనిచ్చేదాన్ని కాదు. ఆయన నా కష్టాలు వింటే, ఎక్కడ బాధపడిపోతాడోనని ఎంతో జాగ్రతగా వుండేదాన్ని. కానీ చివరకు నా సంసారపు బెంగతోనే ఆయన మరణించక తప్పలేదు." అని భిక్షుకి కళ్ళవెంట నీరుపెట్టింది.

* * *

"ఆ రోజు అప్పుడే ఆయన బజారుకు వెళ్ళారు. బజారున వెళ్తున్న బట్టలమూటవాణ్ణి పిలిచి దింపించాను. ప్రతి సంవత్సరం ఏ పండగవంకో పెట్టి మానాన్న తీసుకువెళ్ళి పెట్టే రెండు మూడు చీరలతోనే తృప్తిపడి కాలం గడిపేదాన్ని. కట్టుచీరలుకూడ సంవత్సరానికి ఒకటి రెండుకన్నా వారు తెచ్చేవారు కాదు. బొత్తిగా చీరెలు, చినిగిపోయివుండటంవల్ల, మూటలో ఒక చీర తీసుకుపోయి సవతి అత్తగారికి చూపించి, ఆరు రూపాయిలివ్వమని అడిగాను"

"ఆమె ముఖంచిట్లిస్తూ, రుస, రుసలాడుతూ "ఇక్కడ నీ అబ్బ దాచిపెట్టిన సొమ్మేమీ లేదు పో......సంపాయించి గుట్టలుపోసున్నాడుగా! చచ్చేనాడు కట్టుకుపోతాడా? వెళ్ళి తెచ్చుకోరాదూ!" అని గిరుక్కున తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది. చీర తిరిగి యిచ్చేసి గుడ్డలమూటవాణ్ణి పంపించేశాను. నా తండ్రిని ఆమె అంత చులకనజేసి, మాట్లాడి నిందించినందుకు ఎంతగానో ఆ రోజుఅంతా ఏడ్చాను. నా హృదయం అవమానంతో దగ్ధమైపోయింది." అని భిక్షుకి కొంతసేపు తల వంచేసింది.

"ఆర్థికబలం లేకపోవటంవల్ల సంఘంలో స్త్రీ స్థానం మరీ బలహీనమైపోతుంది." అంది పార్వతి.

"నిజమే. మరి...తరువాత." అన్నాను భిక్షుకి ముఖంలోకి చూస్తూను.

"ఆ పై సంఘటన చెప్పలేనుబాబు! క్షమించండి" అంది, భిక్షుకి.

"ఏం?" అన్నాను.

"ఏం చెప్పను! బాబు! ఆ రోజు అర్ధరాత్రికి యిల్లుచేరుకొన్నవారికి, మేలుకొనివుండే సవతి అత్తగారు చీరవిషయం చెప్పింది ఆయన తాగిన మత్తులో తన్ను తాను తెలుసుకొనే స్థితిలో లేరు. మంచీ, చెడూ...వీటి ఆలోచనతో పనిలేకుండానే, నోటికొచ్చినట్లల్లా మాట్లాడి, చివరకు వారు, నామీద చెయ్యిచేసుకొన్నారు. జీవితంలో మొదటిసారి దెబ్బపడ్డది ఆ రోజే—నా హృదయం అవమానంతో పచ్చిపుండయింది. ఆటుతర్వాత రోజూ, రోజుకూ, ఆకర్షణ లేని, హృదయం లేని ఆ మనిషిని చూస్తుంటే, నాకు విరక్తి, హేయం కలుగ మొదలెట్టాయి. కానీ యిష్టంలేకపోయినా, మనస్సు వ్యతిరేకిస్తున్నా, శరీరాన్ని మాత్రం అప్పుడప్పుడూ ఆయన పశుకాంక్ష, పరితృప్తి చెయ్యటానికి వశం చెయ్యక తప్పేదికాదు. తత్ఫలితంగా గర్భముకూడ కలిగింది. మూడవమాసం వచ్చిన దగ్గర్నుంచీ, నా తండ్రి తనకాళ్ళు అరిగిపోయేటట్లు, నన్ను పంపమని ఆయన చుట్టూ తిరిగాడు. నా భర్త సమాధానం చెప్పక, ముఖం తిప్పేసి తిరుగుతుండేవారు. నా భర్తకూ, సవతిఅత్తగారికీ, నా తండ్రి ఏదో సంపాదించి గుట్టలు పోస్తున్నాడనీ, వారి ఖర్చులకూ, [illegible]లకూ, విలాసాలకూ పంపటంలేదనీ అనుమానం వుండి, ఆయనపై కక్ష సాధించాలన్నట్లు ప్రవర్తించేవారు.

చివరకు పురుడు వచ్చినప్పుడు కూడ సరి అయిన మనిషి దక్షతలేక చాల బాధపడ్డాను. నాకు మగ శిశువుకలిగాడు 'ముద్దపిల్లవాడు' ఆ పుట్టినప్పటికి పురిటి మంచంలో అంత బాధలో వుండీ కూడ ఎంతగానో సంతోషపడ్డాను. ఇక నాబిడ్డ పెరిగి, పెద్దవాడైతే, నాకష్టాలు గట్టెక్కుతాయి. నోట్లోమాటన్న చెప్పుకోటానికి భగవంతుడు ఆదరువు చూపాడు లెమ్మని మురిసిపోయాను. కానీ నాదురదృష్టం కొద్దీ పుట్టిన ఆ, నలుసుకూడ పదవనాడే గురకతో చనిపోయాడు." అని భిక్షుకి ఏడుస్తూవుంటే మాకళ్ళల్లోకూడ నీరు గిర్రున తిరిగాయి.

"కానీ, బాబూ! ఇప్పుడు అలా జరగటమే మంచి దనిపిస్తుంది" అంది భిక్షుకి.

"ఎందుకని?" అన్నాను.

"నా పాట్లతోపాటు, వాడికి రెక్కలు తెచ్చే బాధ్యతకూడ నాపై నేపడేదేమో!......"

"నిజంగా ఆడబ్రతుకంత అధ్వాన్నపు బ్రతుకు మరొకటి లేదండి." అంది పార్వతి

"భార్యా, భర్తలకు ఒకరి మనస్తత్వాన్ని, మరొకరు అర్థంచేసుకొని, సహకారంతో సమర్థించుకొని నడవటానికి తగ్గ విజ్ఞాన వివేకాలు కొరత అవటంవల్లే, సమాజంలో, అజ్ఞానం మూఢనమ్మకాలు, దమననీతి పెచ్చు పెరిగిపోయి, జీవితాలు విషాద, విపరీతపరిణామాలకు గురికావటానికి కారణ మవుతున్నాయి. అమ్మా... తరువాత..." అన్నాను భిక్షుకిముఖంలోకి చూస్తూ.

"పుట్టినబిడ్డ పోయినసంగతి తెలిసి మానాన్న వచ్చి 'పురిటికి పంపలేదు. పుట్టిన బిడ్డపోయాడు. నాలుగురోజులపాటు విశ్రాంతి తీసుకొంటుంది పంప'మని ప్రాధేయపడ్డాడు.

"ఇప్పుడు నీకూతురు కొచ్చిన ప్రమాదమేమీ లేదులే, వల్లకాదు..." అని నాభర్త అంటూవుంటే నాహృదయం పగిలిపోయింది. పచ్చి మంచినీళ్ళు అన్నా తాగకుండా, కాలిచెప్పు అన్నా విడవకుండా బయట వసారాలో మనిషి బయటకుంచే, మానాన్న మెట్లు దిగి వెళ్లిపోతూవుంటే నా అసమర్థతకు, హీనపు బ్రతుక్కు ఎంతగానో కుళ్ళి, కుళ్లి ఏడ్చాను."

"ఆ సంవత్సరం వరదలు వచ్చి పంటలన్నీ నాశనమయ్యాయి. శిస్తుబకాయీక్రింద జమీందారుకు మానాన్న తాను సంపాదించిన కుంటపొలం, ఇల్లూకూడ అమ్మి చెల్లించాడు. పెద్దతనాన రెక్కలమీద, ఆధారపడి బ్రతకాల్సిన గతి పట్టింది ఆయనకు. ఈ సంగతి తెలిసివుండి కూడ, ఒక్కగా, వొక్కకూతుర్నినే బ్రతికుండీ ఆయనకే విధంగాను ఆధారం కాలేకపోయాను. ఆరురూపాయిల కట్టుడు చీరకు నోచుకోని ఆయింట్లో, నాతండ్రికి నేనెక్కడ ఆశ్రయమిచ్చి, స్థానం కల్పించేది?"

* * *

"ఆ రోజు మధ్యాహ్నం మానాన్న జబ్బుతో నీరసించి మంచంపట్టి వున్నాడనీ, నాకోసం కలవరిస్తున్నాడనీ కబురువచ్చింది. "మర్నాటి సాయంకాలానికల్లా ఒకసారిచూచి తప్పక తిరిగొచ్చేస్తానని, ఈ దఫా అయినా పంపించమనీ," కాళ్లా, వేళ్లాబడి నాభర్తను ఎంతగానో ప్రాధేయపడ్డాను."

"తిరిగి మళ్ళీ యీ యింట్లో కాలు పెట్టదలచుకోకపోతే వెళ్ళు." అన్నారు ఆయన.

సవతి అత్తగారికి, కొడుక్కు చెప్పి, సమాధా[illegible], పైగా "పో......దరిద్రగొట్టుదాన! ఇంతటితో మాయింటి పీడ వదలిపోతుంది. లక్షణంగా రేపిపాటికి మరో బంగారంలాంటి పిల్లని తెచ్చుకొని, నాకొడుక్కి చేసుకుంటాను" అంది.

ఆ స్థితిలో నాకేం చెయ్యాలో తోచలేదు. కర్తవ్యనిర్ణయంకోసం మనస్సుతో పెనుగులాడాను. వస్తే భర్తకూ, సంసారానికీ దూరమై చెడిపోయిందానిలాగ వుండాలేమో! వెళ్ళకపోతే తన జీవిత సర్వస్వం నాకోసం ధారపోసిన తండ్రి అంతరాత్మకు ద్రోహం చేసినదాన్ని అవుతానేమో!...ఆలోచించాను. దరీదోవా కనబడలేదు నా జీవితంలో ఏ ఒక్కరోజూ యీ ఇంట్లో సుఖపడలేదు ఏమైనాసరే ధైర్యంచేసి వెళ్తే, నా తండ్రిఅయినా కొంత నన్నుచూచి తృప్తిపడి బ్రతుకుతాడేమోనని ఆశ కలిగింది. ఒంటరిగా అర్ధరాత్రి వేళ, చడీ, చప్పుడూ కాకుండా యిల్లువిడచి, స్టేషను వేపుకు నడిచాను. నా జీవితంలో ఆ రోజే సాహసంతో ఒంటరిగా ఇల్లు విడచి బయటకు రావటం మొదలు. నాలో అంత మనోనిబ్బరం, శక్తి ఎక్కణ్ణుంచి వచ్చాయో నాకే తెలియదు.

టిక్కెట్టు తీసుకొని ప్లాటుఫారంపైకే వచ్చాను. ఎవరైనా ఎరిగినవాళ్ళ కంటబడితే ఏమనుకొంటారోనని భయం, బండి ఎప్పుడు వస్తుందా, ఏ క్షణానవెళ్లి నా తండ్రి పాదాలమీద వాల్తానా అని తహ, తహ, మరోవేపున నా భర్త యిల్లు వదలిపెట్టిన జాడ పసికట్టి, వెతుక్కొంటూ వచ్చి ఎక్కడ పట్టుకొని అల్లరి చేస్తారోనని భయం వేధించ మొదలుపెట్టాయి. ఈ అదుర్దాకు తోడు ఆరోజు బండి రెండు గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆ కాళరాత్రి ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ప్లాటుఫారంపై నిద్రగన్నేరుచెట్టుక్రింద, కన్నార్పకుండా, బండివచ్చే దిశను చూస్తూ కూర్చొన్నాను. ఆ దృశ్యం తలుచుకొంటే నాకిప్పటికికూడ ఎంతో భయం పుడుతుంది" అని భిక్షుకి కొంతసేపు మౌనం వహించింది.

"ఆ. ...పాపం?......అంది పార్వతి.

"ఒంటరిగా బ్రతకటానికైనా, సిద్ధపడి బయలుదేరిన నాకు భయాలు తీర్చేవా రెవరున్నారు? తూర్పు రేఖలు తెల్లవారుతూ వుండగా వెళ్ళి మా యింటి ముందరి గుడిసె వాకిట్లో నిలబడ్డాను. నా తండ్రి బ్రతికిన బ్రతుక్కూ, చివరకు అవసాన కాలంలో ఆయనకు పట్టినగతికీ పోల్చిచూచుకొని ఏడ్చాను. ఎముకలగూడై కుక్కిమంచంలో మూలుగుతున్న తండ్రిని పరుగున వెళ్లి కౌగలించుకొన్నాను. ఆయన నన్ను కలవరిస్తున్నాడు

"నాన్న...నేనే...వచ్చాను. నాన్న...లే. కళ్ళు తెరచిచూడు" అన్నాను.

"ఆ...ఎవరు?...నా చిట్టితల్లా!...వొట్టిది. అబద్ధం. ఆ రాక్షసుడు నా తల్లిని పంపిస్తాడా? సర్వాబద్ధం. నా బంగారుతల్లిని ఆ కసాయివాడికి వప్పగించి, గొంతు కోశాను......"అని మా నాన్న నా జీవితానికై తాను పొందుతున్న వేదనను స్పష్టపరుస్తూ కన్నీరు కార్చాడు.

(16 వ పేజీ చూడుము)

రాళ్లు అమర్చిన రిస్టువాచి రు 20/8



స్విస్‌మేడ్. సరిగా టైంచూపును. ప్రతీదీ 3 ఏళ్ల గ్యారంటీ. గుండ్రం లేక చతురం క్రోమియంకేసు రు. 20/8 మేలిరకం రు. 25/- బిల్లపరుపు ఆకారం క్రోమియంకేసు రు. 30/- రోల్డుగోల్డు (10 సం. గ్యారంటీ) రు. 55/- 15 రాళ్ల క్రోం కేసు రు. 38/- 15 రాళ్ల రోల్డుగోల్డు రు. 75/- రెక్టాంగ్యులర్, వంపుగలది లేక టాను ఆకారము క్రోమియం కేసు రు. 42/- మేలిరకం రు. 45/-
రోల్డుగోల్డు (10 సం. గ్యారంటీ) రు. 60/-
రోల్డుగోల్డు 15 రాళ్ల రు. 30/-
అలారం టైంపీసు: ధర రు. 18/-, రు. 22/-
పెద్దసైజు రు. 25/- పోస్టేజి ఉచితము.
ఏరెండు కొనువారికైనా పోస్టేజి ఉచితము

H. DAVID & CO.,
Post Box No. 11424, CALCUTTA

అధ్వాన్నపు బ్రతుకు

(11వ పేజీ తరువాయి)

"లేదు. నాన్నా! నిజంగా...నేనే...వారు పంపించారు. వచ్చాను"అని మా నాన్నను తృప్తి పరచాలని అబద్ధంకూడ చెప్పాను. మా నాన్నకు కొంత స్పృహ వచ్చింది.

"ఆ...అతడుకూడ వచ్చాడా? అమ్మా!" అని ఎంతో ఆప్యాయంగా మూలుగుతూనే అడిగారు మా నాన్న.

"నా హృదయం నిలువునా నీరైపోయింది. మళ్లీ ధైర్యం తెచ్చుకొని "తొందరపనులకల్ల రాలేకపోయారు. నన్ను స్టేషనుదాకవచ్చి బండెక్కించి వెళ్ళారు. వారుకూడ యీ రాత్రికి తప్పక వస్తారు" అని ఆయన ఆదుర్దా తగ్గించటానికి నిజాన్ని కప్పిపుచ్చుతూ చెప్పాను.

"నేను ఆయన తలగడదగ్గర కూర్చొని ఉపచారం చేస్తున్నంతసేపు, మాటిమాటికీ నా ముఖంలోకి చూస్తూ, లేని ఓపికతో నా కన్నీళ్లు తుడుస్తూ, "ఊరుకో...పిచ్చి తల్లీ! నాకేం ఫరవాలేదు" అని తలమీద చెయ్యివేసి నిమురుతూవుంటే, నా మనోవీధిలో బాల్యంనుంచీ తల్లి లేకపోయినా ఏ లోటూ జరగనివ్వకుండా ఆయన నన్ను పెంచి పెద్దదాన్నిచేసిన ఘట్టాలు ఆ పితృహృదయంలో, నే సంపాదించుకోగలిగిన ప్రేమస్థానం, నా సంసారాన్నిగురించి ఆయన పొందుతున్న మనోవ్యథ నాకు కళ్ళకు కట్టినట్లుగ కనుపించాయి.

"అమ్మా! అతడు వచ్చాడా? వస్తాడంటివే?......" అని చీకటిపడినదగ్గర్నుంచీ అల్లుడికోసరం ఆయన తహ, తహలాడారు.

"వస్తారు, నాన్నా. తప్పక వస్తారు..." అని అబద్ధం చెప్తూనే ఆయన్ని తృప్తిపరచాలని ప్రయత్నం చేశాను.

"పిచ్చితల్లీ! అతడు మనింటి కెందుకొస్తాడమ్మా? నీ భ్రమేకాని. వొచ్చేవాడైతే నీతోపాటే వచ్చేవాడు......" అని మళ్ళీ మూలుగుతూ మా నాన్న నా వొడిలోనే తలకాయ వుంచారు.

కొంతసేపుండి "నాకు తెలుసు...అత డెందుకొస్తాడు. రాడు. ముమ్మాటికీ రాడు. నేచేసిన నేర మేమిటో?..."

మానాన్న అల్లుడికోసరం కలవరిస్తూనే గురకపెట్టడం మొదలెట్టారు. ఆయన అమాయిక హృదయాన్ని అబద్ధం చెప్పి అంతవరకూ అల్లుడు వస్తారని ఆశచూపించిన, నామనస్తత్వానికి నన్ను నేనే నిందించుకొన్నాను. కట్టతెగిన కన్నీటి ప్రవాహాన్ని ఆపుకోలేకపోయాను. నాహృదయంలో బరువు తగ్గిందాకా ఏడ్చాను. ఆ వేడి కన్నీటికే నా తండ్రిహృదయం కాలి బూడిదయిపోయింది.

మధ్యాహ్నానికి తన వాయువుల్ని నాతండ్రి అనంతవాయువుల్లో కలిపివేసి నా వొడిలోనే శాశ్వతనిద్ర చెందాడు."అని, భిక్షుకి ఆపైన చెప్పలేకపోయింది. ఆ మెచరిత్ర వింటున్న నాకు, పార్వతికేగాక ఇంకా ఇద్దరు, ముగ్గురు ప్రయాణికులకు కూడ కళ్లు చెమ్మగిలినై.

"అటు...తరువాత..."అన్నాను.

"నాభర్తకు కబురంపాను. వారు రాలేదు. మా పాలేరు రామన్నసహాయంతో యింకా యితర వూరిపెద్దల ఆధారంతో ఏలాగో నా తండ్రి శవాన్ని అగ్నిసంస్కారం చేయించాను. ఆరాత్రినుంచీ మళ్లీ నాహృదయంలో ఆలోచన బయలుదేరింది. ఏం చెయ్యాలి? ఇంటికి ఎలా వెళ్లను! ఆయనగుమ్మంలో కాలుపెట్ట నివ్వనని పట్టుపడతారేమో! అర్ధరాత్రి అలా యిల్లువదలి పెట్టి ఎందుకు వచ్చేసానా? అని వ్యథ ఒకవేపు, నాకాపురానికి నీళ్లు వొదులుకొన్నా, ఆఖరిక్షణాల్లోనైనా సరే నాచేతులమీదుగానే, నా తండ్రిని సాగనంపుకో గలిగినందుకు కొంత తృప్తి మరోవేపు నన్ను ఉక్కిరిబిక్కిరి చేయ మొదలుపెట్టాయి.

కొట్టినాసరే, చంపినాసరే, వెళ్లి ఆయన కాళ్లమీదే పడదామని నిశ్చయించుకొని మరునాడుదయం బండికి ప్రయాణమై వెళ్లాను. కనుచీకటి పడుతూఉండగా మెట్లెక్కి వసారాలోకి వెళ్లాను. ఎక్కడా అలికిడి లేదు. తలుపు త్రోసి తూర్పింట్లో కాలుపెట్టబోయేటప్పటికల్లా అత్తగారు ఎదురై "ఆ...ఎవరు?...నువ్వా...పద. ముందువరండా మెట్లు దిగుతావా? దిగవా!.. అర్ధరాత్రివేళ లేచిపోయిన ముండవు పోక...మళ్లీ ఎందుకు దాపురించావ్?" అని గద్దించింది.

గత్యంతరం లేక, ఎదురు మాట్లాడే శక్తిలేక బయటవెల్లాలోకి వచ్చి గుబురుగా వున్న ఎర్రగన్నేరుచెట్టు దగ్గర క్రీనీడలో నుంచున్నాను. రెండు నిముషాల్లో ఏదో అదుటైన శబ్దం నా వెనుక కలిగింది. వెంటనే అదిరిపడి వెనక్కి తిరిగిచూచాను. నా పై ప్రాణాలు పైనే పోయాయనిపించింది... బాబూ! క్షమించండి. ఇహ ఆపై సంఘటన చెప్పమని నన్ను బలవంతపెట్టవద్దు"అని భిక్షుకి నాముఖంలోకి చూచింది.

"ఎందుకమ్మా? అలా యథార్థాన్ని చెప్పటానికి భయపడతావు! అన్నాను.

"పోనీలెండి. అభిమానంవల్ల-చెప్పలేకపోతుందేమో!..." అంది పార్వతి.

"అమ్మా! నాకు యింకా అభిమానం కూడనా? అడుక్కుతినేదానికి అభిమానమెందుకమ్మా! చెప్పలేక...ఈ...అధ్వాన్నపు బ్రతుకుఅంతా వింటే, మీ రెంతగా అసహ్యించుకుంటారోనని...బాధ..."

"లేదమ్మా! నీ బ్రతుకులో నీ అవినీతిప్రవర్తన ఏముంది గనుక మేం నిన్ను అసహ్యించుకోవాలి? నీచరిత్ర వింటున్నకొద్దీ నీపై మాహృదయాల్లో ఏర్పడ్డ సానుభూతి మరీ బలీయమౌతుంది." అన్నాడు.

"అయితే, బాబూ! మీలో ఓర్పువుంటే వినండి. చెబుతాను. నాభర్త సిగపట్టుకొని వెనకాల పళ్లు నూరుతూ నుంచున్నారు. ఆయన నోట్లోనుంచి మద్యపానపు కంపు నాముక్కుల్ని బద్దలుచేస్తుంది. కళ్లు బాగా చింతనిప్పుల్లా ఎర్రబారి వున్నాయి. ముఖం చాలా భీకరాకారంతో వుంది.

జుట్టుపట్టుకొని వూపుతూ "రండ.. పోయినదానవు పోక మళ్లీ ఏముఖంపెట్టుకొని నాఇల్లులోకి వచ్చావ్?..... దొంగవేషాలు. అయ్య చచ్చాడని కబుర్లు.. నువ్వుకూడ చస్తే పీడావదిలేది." అని యింకా నోటికొచ్చినట్లల్లా నానా మాటలూ మాట్లాడి, అసలే నీరసంగా వున్న శరీరాన్ని, హూనంచేసి రోడ్డుమీదకు లాగారు.

"అడుగు యివతలకు పెట్టావా నరుకుతాను. జాగ్రత్త. ఫో..."అని సడ్డురిమి, గేటు వేసుకొని ఆయన లోపలికి వెళ్లా.

నా కెటుపోవాలో, ఏం చెయ్యాలో తోచక చాలాసేపు రోడ్డుమీద నిలబడ్డాను. ఎలాగైనా యీ గుక్కెడు ప్రాణాలను కడతేర్చాలనుకొని వూరివెలుపలి చెఱువుగట్టుకేసి బయలుదేరాను. నాలుగైదు ఇళ్ళు దాటంగానే, నాకు పరిచితమైన స్వరంలోనుంచే యిలా మాటలు వినపడ్డాయి.

"ఎప్పుడొచ్చిందీ చెడుభాగ్యపుది మళ్లీ వూళ్లోకి? పోకదలమారి...మళ్లీ ఎక్కడికో బయలుదేరిందే? ఆ మొగుడు దీన్ని కట్టుకున్నందుకు ఎంత అల్లరిపాలవుతున్నాడంటేను! ఇది ఏ ముహూర్తాన ఆ యింట్లో కాలుపెట్టిందోగాని, ఎప్పుడూ ఏదో ఒక గొడవే. ఇటువంటి......కల్ల వూరిపేరు కూడ నాశనమవుతుంది."

"మళ్లీ నాలు గిళ్లు దాటాను. మరో కంఠస్వరంలోనుంచీ యిలా మాటలు వెలుపడ్డాయి."

"అర్ధం రేత్రికాడ ఎవడితోనో లేచిపోయిందటగ! మళ్లీ కాలు పెట్టడానికి ముఖం ఎట్లా చెల్లింది? ఇడిసేసి తిరిగే...లజ్జా! భయమా! ఏం? ఆ బ్రతుకు ముదనష్టపు బ్రతుకు, బ్రతక్కపోతే, ముక్కుమూసుకొంటే, మూడు ఘుళ్లు పట్టదు."

"ఇది, బాబు! లోకం తీరు. ఆ మాటలు వింటూంటే నా హృదయం బల్లెపుపోట్లు తింటున్నట్లుగా వుంది. తూట్లుపడ్డ హృదయంతో, తడబడుతున్న కాళ్లతో లేని ఓపికతో ఆయాసపడుతూ చెఱువుగట్టుపైకి చేరాను. గట్టు ఎక్కేటప్పటికి కళ్లు గిర్రున తిరిగాయి. అడుగు తీసి అడుగు వెయ్యలేక పోయాను. అక్కడే కూలబడ్డాను. స్మృతితప్పిపోయింది. తెలివి కలిగి చూచేటప్పటికి నా తల ఎవరి వొళ్లోనో వున్నట్లు, ఎవరో ఉపచారం చేస్తున్నట్లు గోచరించింది. ఉలిక్కిపడి లేచాను. ఎదురుగా మానవాకారం స్పష్టంగా గోచరించింది."

"ఎవరు? బాబు! మీరు." అని అడిగాను.

"నేనా? దిక్కులేని అంధభిక్షువుని. నీ వెవరవమ్మా? ఈ సమయంలో ఇక్కడ పడిపోయివున్నావేం?" అని అతడు జాలిగా అడిగాడు.

"ఆ చీకటిలో అతడు చెప్పేవరకూ అతడు అంధుడని నే గుర్తించలేకపోయాను. 'బ్రతుకు భారమైయీ గుక్కెడు ప్రాణాల్ని వొదులుదామని వచ్చాను బాబు మీరీ సమయంలో ఇక్కడి కెందుకొచ్చారు?"

"మాధాకవళాలతో పొట్టనింపుకొని, రోజూ యిన్ని నీళ్ళు త్రాగి ఈ చెఱువుగట్టుమీదే ఒక ప్రక్కన పడుకుంటాను ఇవ్వాళకూడ మామూలు వేళకే పని పూర్తిచేసుకొని పడుకొందామని వెళ్తూంటే దారిలోపడివున్న నీ శరీరం నా కాలికి తగిలిందమ్మా. ఒక నిముషం ఏమిటోనని అంజాయించాను. ధైర్యం చేసి తాకిచూచాను. శ్వాస చాల బలీయంగా వస్తున్నట్టు గుర్తించి, అయినా ప్రయత్నంచేసి చూద్దామని నాయీ జోలెగుడ్డ తడిపి తెచ్చి ఇన్ని నీళ్లి ముఖానపిండి, తుడిచి, ఏం చెయ్యటానికీ తోచక అలా తల వొళ్లో పెట్టుకు కూర్చున్నాను. కొంతసేపటికి ఇటూ, అటూ పొర్లావు. నా కెంతో ఆనందం కలిగింది." అని అంధభిక్షువు చెబుతూంటే, ఆశ్చర్యమూ, దుఃఖమూకూడ ఒక్కసారిగ వొచ్చాయి. మానవుడి హృదయానికి అంధత్వం లేకపోతే, బాహ్యేంద్రియంగా అంధత్వముంటే మాత్ర మేం? హృదయంలేని మానవుడికి కళ్ళు ఉండీ మాత్రం ప్రయోజన మేముంది?..." అనిపించింది.

ఆ అంధభిక్షువు ముఖంలోకి చూస్తూ "బాబూ! అంత శ్రమపడి ఉపచారంచేసి నన్నెందుకు బ్రతికించావు? చావనివ్వక పోయావా?..." అన్నాను.

"పిచ్చితల్లీ! ఎంతమాట! ఏ జీవికైనా ప్రాణంకంటే తీపిఅయిన వస్తు వేముంటుంది? నీ హస్తాన్ని స్పృశిస్తేనే ఎక్కడిదా? యీ అమృతహస్త మనిపిస్తుంది. అల్లాంటి నీకీ విరక్తి, జీవితంపై హేయం ఎందుకు కలిగిందమ్మా" అని అంధభిక్షువు కరుణతో అడిగాడు."

అతనికి నా జీవిత సంఘర్షణ, నా దృఢనిశ్చయాన్ని దాయకుండా చెప్పాను. "చచ్చి ఎవర్ని సాధిస్తావమ్మా? లోకంపైనా నీ కక్ష! బ్రతుకునే నేరంగా చేసుకుంటే, క్షణమైనా బ్రతగ్గలమా? ప్రతిప్రాణికీ జీవితాశకన్నా గొప్పఆశ ఏముంటుంది? పైకి యీ లోకం ఎంత అమృతతుల్యంగా కనబడుతుందో, లోపల అంత హాలాహలంతో చల, చల మరుగుతూ, వుంటుంది. నీబోటి అభాగినులు, ఎంతమంది నిత్యానైవేద్యం క్రింద సంఘానికి బలి అవుతున్నారో గదా!......"అని అంటూండగానే అతడి కళ్ల వెంబడి నీళ్ళు కారాయి.

"అమ్మా! నామాట విను. నువ్వు సందేహించకు. నాకెవ్వరూ దిక్కులేరు. ఇదిగో యీ దరియాతీసుకొని తీగలు మీటుతూవుండు. నేపాట పాడగలను. మన జీవనోపాధిగడుస్తూవుంటుంది." అన్నాడు.

భిక్షాటన మనేటప్పటికి మనస్సు అభిమానంతో పీకింది. చాలాసేపు ఆలోచించాను. కానీ అతడి ప్రేమపూరితవాక్కులు, లాలన నా దృఢనిశ్చయాన్ని భగ్నంచేసి, జీవితాశను కలిగించాయి. చూస్తూ, చూస్తూ నిండుప్రాణాల్ని చెఱువుకు అర్పించాలని లేకపోయింది. ఏమి చెప్పటానికీ తోచక "అలాగే, బాబు!" అనేశాను. కొంతసేపుండి "బాబు! ఒకవిషయం మీరు వొప్పుకోవాలి." అన్నాను.

"ఏమిటమ్మా అది?" అని అడిగాడు

"మన వృత్తి నిరాటంకంగా సాగిపోవాలంటే, మనం చాలా దూరప్రాంతాలకుపోవాలి. అది మీ కిష్టమేనా?" అన్నాను.

"అట్లాగేలే, తల్లీ! ఎక్కడైతే యేం?" అన్నాడు.

ఆ తెల్లవారు ఝామునే లేచి నే దరియా తీసుకొని ముందు నడువ మొదలెట్టాను. అతడు నావెంటనే కర్ర పూతంతో బయలుదేరి నడువనారంభించాడు. ఊరి పొలిమేర దాటుతుంటే ఆపుకుందామన్నా ఆగకుండా కళ్ల వెంబడి నీరు పొర్లు కొచ్చాయి." అని భిక్షుకి కొంతసేపు ఆపింది.

అంతవరకూ నిశ్చేష్టులమై ఆమె జీవితం వింటున్న పార్వతీ, నేనూకూడ ఒకసారిగ నిట్టూర్చాం.

కొంతసేపుండి "మరి అత డెప్పుడు మరణించాడు?" అన్నాను.

"ఈమధ్యనే, ఆరుమాసాలయింది బాబు!"

"జబ్బు చేసిందా?"

"కలరా తగిలింది......నే పోయినా బాగుండేది, బాబు!"

"పిచ్చిదాన, మన చావు, పుట్టుకలు మన చేతుల్లో వున్నాయా?" అంది పార్వతి.

"అవు. నిజమేనమ్మా! అధ్వాన్నపు బ్రతుకు బ్రతకలేకనే అలా అనుకోవటం."

కొంతసేపు ఆలోచించి "ఏ, అమ్మా! మరి మాతో వచ్చేస్తావా? తీసుకుపోతాం." అన్నాన.

"ఎక్కడికి, బాబు! ఏంపని చెయ్యాల్సి వుంటుంది? మీబోటి గౌరవంగా బ్రతికేవాళ్ళిళ్లలోకి, మాబోటి అధ్వాన్నపుబ్రతుకు బ్రతికేవార్ని రానిస్తారా? మీ గౌరవప్రతిష్ఠలకు భంగంకాదా?" అంది నిరాశగా చూస్తూ.

"లేదు. అమ్మా! మేమొక శరణాలయం నడుపుతున్నాం. అందులో చాలామందిఅనాథ, బాలబాలికలున్నారు. వృత్తివిద్య, చేతిపనులు నేర్చుకొంటూ వుంటూరు. నువ్వుకూడ అక్కడవాళ్ళను కనిపెట్టుకొని వుంటూ, చేతనైన పనిచేస్తూ వుండవచ్చు. నీ పోషణభారం మేం వహిస్తాం సరేనా?" అన్నాను.

"మీదయ.. బాబు!"

ఆచారభేదాలు

(7 వ పేజీ తరువాయి)

కావడం చేత మనదేశానికి యీ క్షామబాధ సిద్ధించింది. దీని క్కారణం నైతే.

"కుంభకోణే కృతం పాపం
కుంభకోణే వినశ్యతి".

అన్నట్లు రైలువల్ల వచ్చిన చిక్కు రైలువల్లనూ, స్టీమర్లవల్ల వచ్చినచిక్కు స్టీమర్లవల్లనూ తీరాలిగాని అన్యథా తీరే వుపాయం కనపడదు. యెందలు యెన్ని చోట్లకు రాయబారాలుగా వెళ్లినా పదార్థమంటూ వుంటే తప్ప ప్రయోజనం వుండదుగదా! యిప్పుడు సమృద్ధిగా వర్షాలు కురిసినా కలువు వెంటనే పోదు. వచ్చేవత్సరం పోవాహలి. పొక్క వర్షంతో చే లేదు. యింకా యెన్నోయోగాలు అనుకూలించాలి. యితరదేశాలుకూడా బాగా ఫలించాలి. లేకపోతే మన నోటికి మన పంట అందదు. మన షావుకార్లు మన దేశానికి అరిష్టగ్రహాలుగా పరిణమిస్తారు. యెన్నివిధాల అవయోగాలు వుండాలో అన్నీ సమకూడివున్నాయి.

"స్వరాజ్యం" వస్తేమాత్రం వీట్లని తట్టుకోగలదా? పాపం, యేమో, "తినబోతూ రుచు లెందుకు?" హరిజనులు వ్యవసాయదారుల్ని యిప్పుడే పీల్చుకుతింటూన్నారు. బస్తా 1 కి రు 20-0-0 లేనా వెల వుంటేనేకాని రైతుకు వితనాలు కూడా మిగలనిచ్చేటట్టులేదు కూలి ధోరణి. అంతా కూలీలకింద మాటితే బాగుంటుందనిపిస్తూవుంది. కాని ఆ పద్ధతిని వ్యవసాయం చేసి గవర్నమెంటుకు పన్నెవరు చెల్లిస్తారు? మాట్లాడేటప్పటికల్లా సమ్మె. అక్కడినుంచి కాల్పులు, పేల్పులు. యీ దేశానికి మంచికాలమంటూ భవిష్యత్తులో వుందా? అనిపిస్తుంది. యెందు కన్నాడో నన్నయ్య భట్టారకుడు—"గతకాలము మేలు వచ్చు కాలముకన్నన్" అన్నాడు—మహానుభావుడు, నిత్యసత్యవచనుడు, మత్యమరాచార్యుడు. "సక్కవి వాక్యము రిత్తవోవునే".

ఆంధ్రవాఙ్మయ చరిత్ర

కర్త: కళాప్రపూర్ణ
కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావు

సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయ చరిత్రకు విశుద్ధదర్పణం.

వెల రూపాయలు 2.
తపాలాఖర్చు 0-6-0.

ఆంధ్రగ్రంథమాల,
తపాలాపెట్టె 212, మద్రాసు.